

బీజేపీ మాజీ ఎమ్మెల్యే ప్రీతంగౌడపై కేసు



బెంగళూరు, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): హాసన్ నియోజకవర్గ బీజేపీ మాజీ ఎమ్మెల్యే ప్రీతంగౌడపై బెంగళూరు సైబర్‌క్రైం పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ మహిళలపై లైంగికదౌర్జన్యాలకు పాల్పడిన వీడియోలను వైరల్ చేశారని ప్రీతంగౌడతోపాటు ఆయన అప్తులైన కిరణ్, శరత్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. 354 బి, 506, 66ఇ సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేశారు.



గడ్డు పరిస్థితుల్లో ప్రకృతి చికిత్స

● యోగా, ప్రకృతి చికిత్సా కేంద్రాల పట్ల నిర్లక్ష్యం ● నిధులు లేక నీరసిస్తున్న వైనం ● ఆందోళనలో సిబ్బంది, రోగులు

బెంగళూరు, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం, శ్రీక్షేత్ర ధర్మస్థళ శాంతివన ట్రస్టు సంయుక్త ఒప్పందంతో 14ఏళ్ల క్రితం పది జిల్లాల్లో ప్రారంభించిన ప్రభుత్వ ప్రకృతి చికిత్సా కేంద్రాలు గడ్డు పరిస్థితికి చేరాయి. ఆధునికీకరణకు జాప్యం, గ్రాంట్ల కొరత వంటి కారణాలతో స్తంభించిపోవడంతో ఓవైపు సిబ్బంది, మరోవైపు రోగులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో అరసికెరె, చామరాజనగర, హొసదుర్గ, జగలూరు, కనకపుర, పుత్తూరు, సంకేశ్వర, శృంగేరి, శ్రీరంగపట్టణ, తీర్థహళ్లిలో ప్రభుత్వ, ధర్మస్థళ శాంతివన ట్రస్టుచే కొనసాగుతున్న కేంద్రాలకు ఈనెల 3నుంచి 6 వరకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం, శాంతివన ట్రస్టు మధ్య ఒప్పందం రెన్యూవల్ అయ్యేవరకు పనిచేయరాదంటూ ప్రభుత్వ ఆయుష్‌శాఖల ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. వీటి ప్రకారం ఈనెల 30 నుంచి దాదాపు అన్ని కేంద్రాలకు తాళాలు పడే అవకాశం ఉంది. ఒప్పందం 2022 మార్చిలోనే ముగిసింది. అరసికెరెతోపాటు మరో 9 జిల్లాల్లో వివిధ తాలూకాల్లో యోగా, ప్రకృతి చికిత్సా కేంద్రాల్లో నిపుణులైన వైద్యులతోపాటు వందలాదిమంది సిబ్బంది పనిచేస్తున్నారు. ఒప్పందాన్ని రెన్యూవల్ చేయనిపక్షంలో తమ భవిష్యత్తు ఏం కానుందోనని ఆందోళన చెందుతున్నారు. నిపుణులైన వైద్యులకు ప్రకృతి చికిత్సా కేంద్రాలు కాదంటే మరోచోట ఉద్యోగాలు లభిస్తాయి. కానీ 15ఏళ్లపాటు ఈ కేంద్రాల్లో పనిచేసిన వివిధ కేడర్ల సిబ్బంది భవిష్యత్తు అంధకారమయ్యే పరిస్థితి నెలకొంది. 25-30 ఏళ్ల మధ్య ఉద్యోగాలలో చేరినవారు ప్రస్తుతం 40-45 ఏళ్ల మధ్య ఉన్నారు. అలాంటి వారు తమకు కొత్త ఉద్యోగాలు లభించవని, భవిష్యత్తు ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ప్రకృతి చికిత్సా కేంద్రాల్లో పనిచేసేవారికి తక్కువ వేతనాలు చెల్లించేవారు. ప్రభుత్వ అనుబంధం కావడంతో వేతనాలు, పని గ్యారెంటీ ఉంటుందని ఇక్కడ అనుభవం లభిస్తుందని ఆసక్తి చూపారు. డాక్టర్లకు ఇక్కడ రూ.18-20 వేలు, ఉద్యోగులకు రూ.10-12 వేలు వేతనాలు ఇస్తున్నారు. అసలే అంతంతమాత్రం వేతనాలతో పనిచేసిన ఉద్యోగులు ఒక్కసారిగా అయోమయంలో పడ్డారు. ప్రజాప్రతినిధులు, సంఘసంస్థల ముఖ్యులు ప్రకృతి ఆరోగ్య అభిమానులు చికిత్సా కేంద్రాలను కొనసాగించేలాంటి చర్యలకు సహకరిస్తారా అనేది వేచి చూడాల్సి ఉంది. ప్రభుత్వ ప్రకృతి చికిత్సా కేంద్రాలు నగర, గ్రామీణ ప్రాంతాల ప్రజల ఆరోగ్య సంజీవినులుగా పనిచేస్తున్నాయి. కీళ్లనొప్పులు, మోకాళ్లు, భుజం, పార్శ్వవాయువు, గొంతు, పాదాలతోపాటు శరీరంలోని వివిధ భాగాల నొప్పులకు వివిధ రకాల తైలాలతో మసాజ్ (ఫిజియోథెరపీ) చికిత్సలు అందుబాటులో ఉండేవి. బీపీఎల్ రేషన్‌కార్డులు కల్గిన వేలాదిమంది ఉచితంగా చికిత్సలు పొందుతూ ఉపశమనం పొందేవారు. కీళ్ల, ఆర్థో వైద్యులు కూడా ఫిజియోథెరపీకి ప్రకృతి చికిత్సా కేంద్రాలకు సిఫారసు చేసేవారు. ఇక్కడి సిబ్బందికి అనుభవం ఉంటుందని సూచించేవారు. ఇలాంటి కేంద్రాలను కొనసాగించకుండా ఉండేలా ఆదేశాలు జారీ చేయడం సర్వత్రా విమర్శలకు కారణమవుతోంది. పది కేంద్రాల పరిధిలో చికిత్సలు పొందుతున్న వేలాదిమంది ఆయుష్, ఉన్నతాధికారులకు వినతులు ద్వారా కేంద్రాలను కొనసాగించేలా డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తే కేంద్రాలు కొనసాగే అవకాశం ఉంది. ఈ మేరకు సిబ్బంది, వైద్యులు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావును కలిసేందుకు సిద్ధమవుతున్నారు.



మూతపడిన ప్రకృతి చికిత్సా కేంద్రం



పార్లమెంటులో ప్రమాణస్వీకారం చేస్తున్న కె.గోపీనాథ్

తెలుగెత్తి చాటిన గోపీనాథ్

● తెలుగులో ప్రమాణ స్వీకారం చేసిన కృష్ణగిరి ఎంపీ ● హోసూరు తెలుగు ప్రజల హర్షం

హోసూరు, జూన్ 25: హోసూరుకు చెందిన గోపీనాథ్ తెలుగు భాషపై తన మమకారాన్ని మరోసారి ఢిల్లీలో ఎలుగెత్తి చాటి ఈ ప్రాంత వాసుల మనసును దోచుకున్నారు. తమిళనాడులోని కృష్ణగిరి నియోజకవర్గ లోక్‌సభ సభ్యుడు కె.గోపీనాథ్ మంగళవారం పార్లమెంటులో తెలుగులో ప్రమాణ స్వీకారం చేయడం అందరినీ ఆకట్టుకుంది. కాంగ్రెస్ సీనియర్ నేత అయిన గోపీనాథ్ తెలుగు కుటుంబానికి చెందిన వారు. కృష్ణగిరి జిల్లా హోసూరుకు చెందిన ఆయన తెలుగు మాధ్యమంలోనే విద్యాభ్యాసం చేశారు. ఆయన 2001, 2006, 2011లో హోసూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. తమిళనాడులో నెలకొన్న తెలుగు భాషా సమస్యల కోసం, తెలుగు వారి కోసం పోరాడే యోధుడిగా ఆయనకు మంచి పేరుంది. అందుకే ఆయన వరుసగా మూడుమార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కరడుగట్టిన తమిళవాదులుండే తమిళ అసెంబ్లీలోనూ ఆయన పలుమార్లు తన మాతృభాష అయిన తెలుగులోనే ప్రసంగించారు. 2012లో అసెంబ్లీలో ఆయన ప్రసంగం విన్న నాటి ముఖ్యమంత్రి జయలలిత సైతం 'తెలుగు భాషకు వచ్చిన సమస్య ఏంటో చెప్పండి.. పరిష్కరిస్తాం..' అంటూ తెలుగులో సమాధానమివ్వడం విశేషం. మాతృభాష పట్ల ఎనలేని మమకారమున్న గోపీనాథ్.. పార్లమెంటులో కూడా తెలుగులోనే ప్రమాణస్వీకారం చేయడంతో పలువురు తమిళ ఎంపీలు సైతం హర్షధ్వానాలతో ఆయన్ని అభినందించడం విశేషం. ఢిల్లీకి రాజైనా తన తల్లిని, మాతృభాషను మరచిపోని వాడే నిజమైన నాయకుడు అనే రీతిలో గోపీనాథ్ తెలుగులో ప్రమాణస్వీకారం చేయడంతో హోసూరులో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. మాతృభాష తెలుగులోనే ప్రమాణం చేసి కృష్ణగిరి జిల్లా తెలుగు ప్రజల గౌరవాన్ని నిలబెట్టారని అభినందనలు వెల్లువెత్తాయి. ఇది కృష్ణగిరి జిల్లా తెలుగు ప్రజల్లో సంతోషాన్ని రెట్టింపు చేసింది. ప్రస్తుతం ఢిల్లీలో ఆయన పార్లమెంటులో ఏ భాషలో ప్రమాణ స్వీకారం చేస్తారోనని ఎదురు చూసిన తెలుగు ప్రజల గుండెల్లో మరోసారి నిలిచిపోయారు. పార్లమెంట్‌లో పోరాడి తమిళనాడులోని తెలుగు ప్రజలకు న్యాయం చేకూరుస్తారని నమ్మకంతో ఎదురుచూస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ఎల్‌కేజీ, యూకేజీ

బెంగళూరు, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్న తరుణంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు నిరంతర ఆందోళనకు దిగారు. దీంతో ముఖ్యమంత్రి సిద్దరామయ్య అత్యవసరంగా సంబంధిత మంత్రులు, అధికారులతో చర్చలు జరిపారు. ప్రాథమిక విద్యాశాఖ మంత్రి మధుబంగారప్ప, స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్, ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి రజనీశ్‌గోయెల్‌తోపాటు ముఖ్య అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. చివరకు ఒక నిర్ణయం తీసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ఎల్‌కేజీ, యూకేజీలను ప్రారంభించాలని సీఎం సిద్దరామయ్య తేల్చి చెప్పారు. కాన్వెంట్ల తరహాలో తరగతులు నిర్వహించేందుకు ప్రభుత్వం సమ్మతించింది. సుదీర్ఘకాలంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎల్‌కేజీ తరగతులు ప్రారంభించాలనే డిమాండ్ ఉంది. పిల్లలకు విద్యాశాఖ ద్వారానే యూనిఫాం, పుస్తకాలు, బ్యాగులు ఇవ్వాలని నిర్ణయించారు.

● తేల్చి చెప్పిన ముఖ్యమంత్రి సిద్దరామయ్య

సీఎంతో రేణుకాస్వామి తల్లిదండ్రుల భేటీ

బెంగళూరు, జూన్ 25(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు దర్శన్, అతడి అనుచరుల చేతిలో హత్యకు గురైన చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి తల్లిదండ్రులు మంగళవారం ముఖ్యమంత్రి సిద్దరామయ్యను అధికారిక నివాసం కృష్ణలో కలిశారు. రేణుకాస్వామి మృతి పట్ల సీఎం తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మీ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తప్పు చేసి ఉంటే బుద్ధి చెప్పవచ్చునని లేదా పోలీసులకు అప్పగించాల్సి ఉండేదని, హత్య చేసి తమ కుటుంబాన్ని రోడ్డున పడేశారని తల్లిదండ్రులు వాపోయారు. రేణుకాస్వామి తల్లి కొంగు పట్టుకుని మా కుటుంబానికి న్యాయం చేయాలని సీఎంను వేడుకున్నారు. రేణుకాస్వామి భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని కోరుకున్నారు. సీఎం సానుకూలంగా స్పందించారు. మంత్రి చలువరాయస్వామి కూడా ఉన్నారు.



సీఎం వద్ద గోడు వెళ్లబోసుకుంటున్న రేణుకాస్వామి తల్లిదండ్రులు

బెంగళూరు కోర్టుకు ఉదయనిధి

● సనాతన ధర్మంపై వ్యాఖ్యల వ్యవహారంలో హాజరు ● షరతులతో కూడిన బెయిల్ మంజూరు

బెంగళూరు, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తమిళనాడు రాష్ట్ర మంత్రి ఉదయనిధికి బెంగళూరు న్యాయస్థానం షరతులతో కూడిన బెయిలు మంజూరు చేసింది. చెన్నై నగరంలో గత ఏడాది సెప్టెంబరు 20వ తేది 'సనాతన నిర్మూలన మహానాడు' జరిగింది. ఈ మహానాడులో పాల్గొన్న మంత్రి ఉదయనిధి.. డెంగీ, మలేరియాల్లానే సనాతన ధర్మాన్ని నిర్మూలించాల్సిన అవసరముందని వ్యాఖ్యానించారు. దీనిపై దేశవ్యాప్తంగా పలు హిందూ సంస్థలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ వ్యవహారంపై ఇప్పటివరకు 8 కేసులు నమోదయ్యాయి. ఉదయనిధిపై క్రిమినల్ చర్యలు చేపట్టాలంటూ బెంగళూరుకు చెందిన రమేష్ బెంగళూరులోని ఎంపీ, ఎమ్మెల్యేల కేసులు విచారిస్తున్న ప్రత్యేక న్యాయస్థానంలో పిటిషన్ వేశారు. ఈ 8 కేసులు వేర్వేరు రాష్ట్రాల్లో దాఖలైన నేపథ్యంలో, అన్నింటినీ ఒకటిగా చేర్చి ఒకే ప్రాంతంలో విచారించాలని కోరుతూ ఉదయనిధి తరఫున న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. ముఖ్యంగా, ఉదయనిధితో పాటు, సనాతన ధర్మ నిర్మూలన మహానాడు ఏర్పాటు చేసిన వెంకటేష్, ఆదవన్, మధుకూర్ రామలింగం తదితరులపై కూడా క్రిమినల్ చర్యలు చేపట్టాలని రమేష్ పిటిషన్‌లో పేర్కొన్నారు.

న్యాయస్థానంలో ఉదయనిధి హాజరు

ఈ పిటిషన్‌కు వ్యతిరేకంగా వెంకటేష్, ఆధవన్, మధుకూర్ రామలింగం తదితరులు కర్ణాటక హైకోర్టులో క్రిమినల్ చర్యలపై స్టే విధించాలని కోరుతూ గత వారం పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారించిన న్యాయమూర్తి జస్టిస్ కృష్ణా ఎస్.దీక్షిత్, ఈ కేసులో క్రిమినల్ చర్యలు చేపట్టడంపై తాత్కాలిక స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయనిధి బెంగళూరు న్యాయస్థానంలో హాజరయ్యారు.

ఆగస్టు 8కి వాయిదా

ఉదయనిధితో హాజరైన సీనియర్ న్యాయవాది పి.విల్సన్, ఆయనకు బెయిలు మంజూరు చేయాలని, కేసు విచారణకు నేరుగా హాజరుకావడంపై శాశ్వతంగా మినహాయింపు ఇవ్వాలని వేర్వేరు పిటిషన్లు వేశారు. ఈ పిటిషన్లు అంగీకరించిన న్యాయమూర్తి శరవణ.. ఉదయనిధికి బెయిలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అన్ని కేసులు ఒకటిగా విచారించాలన్న పిటిషన్లపై సుప్రీంకోర్టు నిర్ణయం వెలువడిన అనంతరం, ఈ కేసు విచారణ చేపడతానని ప్రకటిస్తూ తదుపరి విచారణ ఆగస్టు 8వ తేదీకి వాయిదావేశారు. కాగా, బెంగళూరుకు న్యాయస్థానంలో మంత్రి ఉదయనిధి హాజరవుతుండడంతో కోర్టు ప్రాంగణంలో భారీ పోలీసు భద్రత ఏర్పాటు చేశారు.



కోర్టు నుంచి బయటకు వస్తున్న ఉదయనిధి

రైతులకు న్యాయం చేయాలి

● భూములకు సరైన ధరతో పరిహారం ఇవ్వాలి

● జేడీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరీశ్‌గౌడ డిమాండ్

దొడ్డబళ్లాపుర, జూన్ 25: పారిశ్రామిక ప్రదేశ అభివృద్ధి కోసం భూములు కోల్పోతున్న రైతులకు సరైన ధరతో పరిహారం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని జేడీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరీశ్‌గౌడ డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రవాసిమందిరంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రైతులు భూమి ఇవ్వడాన్ని ఒక త్యాగంగా చెప్పడంలో తప్పేమి లేదన్నారు. భూమి కోల్పోవడం అనేది రైతుల బతుకులో ఒక కీలకఘట్టం అన్నారు. పారిశ్రామికాభివృద్ధి కోసం భూములు కోల్పోయిన కోనఘట్ట, ఆదినారాయణ హొసహళ్లి, నాగదేనహళ్లి రైతులు 165 రోజులుగా తమ భూములకు సరైన ధరతో పరిహారం ఇవ్వాలని కోరుతూ పోరాటం చేస్తున్నారని తెలిపారు. వందలాది రోజుల పోరాటం తమాషా కాదన్నారు. ప్రతిరోజు చేసే పని రైతుకు ఎంతో కీలకమని అయితే ప్రభుత్వం మాత్రం రైతు సమయానికి విలువ ఇవ్వడం లేదని అన్నారు. దేశ అభివృద్ధి కోసం రైతులు తమ కర్మభూమిని కోల్పోయేందుకు సిద్ధంగా ఉన్నా కనీస పరిహారం ఇవ్వడంలో నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామితో భేటీ కావడంతో సుమారు రూ.30లక్షలు పెంచే భరోసా లభించిందన్నారు. ఎటువంటి అభివృద్ధి పనులకు భూమి స్వాధీనం చేసుకున్నా ప్రతి ఎకరాకు 1:4 దామాషా ప్రకారం ఇవ్వాలన్న నిబంధన ఉందని, ప్రస్తుతం ఎకరాకు రూ. 70 లక్షలు ఉండగా ప్రతి ఎకరాకు రూ.2.80 కోట్ల పరిహారం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. టీఏపీఎంసీఎస్ మాజీ అధ్యక్షుడు ఆనంద్ మాట్లాడుతూ 165 రోజులుగా నిరసన చేస్తున్నామని తెలిపారు. మాజీ సీఎం కుమారస్వామి, మంత్రి ఎంబీ పాటిల్‌తో చర్చలు జరిపారని, నాలుగుసార్లు సమావేశం నిర్వహించారని పేర్కొన్నారు. అధికారి సెల్వకుమార్ ప్రతి ఎకరాకు రూ.20లక్షలు పెంచారని తెలిపారు. రైతు నేత సి. కృష్ణప్ప మాట్లాడుతూ అధికారులు ప్రతి ఎకరాకు రూ.1.80 కోట్లు ఇచ్చేందుకు ముందుకు వచ్చారన్నారు. మీడియా సమావేశంలో జిల్లా పంచాయతీ మాజీ సభ్యుడు అప్పయ్యణ్ణ, ఎ. నరసింహయ్య, బైరేగౌడ, దాసగొండహళ్లి చంద్రప్ప, అశ్వత్థనారాయణ, ప్రభుదేవ్ తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో జేడీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరీశ్‌గౌడ తదితరులు



ఎమ్మెల్సీ స్థానానికి నోటిఫికేషన్

- తొలిరోజు నామినేషన్లు నిల్

బెంగళూరు, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): శాసనసభ్యుల కోటాలో ఎమ్మెల్సీని ఎన్నుకునేందుకు నోటిఫికేషన్ జారీ అయ్యింది. మంగళవారం నుంచి జూలై 2వరకు నామినేషన్ల దాఖలుకు అవకాశం కల్పిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. ఎమ్మెల్సీ జగదీశ్‌శెట్టర్ రాజీనామాతో ఎన్నిక జరుగుతోంది. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన జగదీశ్‌శెట్టర్ రాజీనామా చేసి ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నుంచి గెలుపొందిన విషయం తెలిసిందే. ఆయన రాజీనామాతో ఖాళీ అయిన స్థానానికి ఎన్నిక జరుగుతోంది. నామినేషన్ల పరిశీలన జూలై 3న, ఉపసంహరణకు 5వరకు గడువు ఉంది. జూలై 12న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4వరకు పోలింగ్ కొనసాగనుండగా అదే రోజున సాయంత్రం ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతుందని శాసనసభ కార్యదర్శి ఎంకే విశాలాక్షి ప్రకటించారు.





హెచ్ఏఎల్ ఎయిర్‌పోర్టులో ఏపీ సీఎం చంద్రబాబుతో అభిమానులు

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు

ఘన స్వాగతం

బెంగళూరు, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సొంత నియోజకవర్గం కుప్పంలో రెండు రోజుల పర్యటన కోసం మంగళవారం బెంగళూరుకు వచ్చారు. ప్రత్యేక విమానంలో హెచ్ఏఎల్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న చంద్రబాబును చిత్తూరు జిల్లా వాసులతోపాటు బెంగళూరుకు చెందిన తెలుగుదేశం పార్టీ అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. మధ్యాహ్నం ఎయిర్‌పోర్టుకు వచ్చిన చంద్రబాబుకు పలువురు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలతో సత్కరించారు. తంబళ్లపల్లెకు చెందిన పెద్దమండ్య పార్టీ అధ్యక్షుడు జిత్తా వెంకటరమణ, మనోజ్‌రెడ్డి, మహదేవ్ సందీప్ తదితరులు ఉన్నారు. ఇదే సందర్భంగా తంబళ్లపల్లె నియోజకవర్గంలో పార్టీ ఓటమికిగల కారణాలపై ఓ వినతిని చంద్రబాబుకు అందించారు. అనంతరం ఆయన ఎయిర్‌పోర్ట్ నుంచి హెలికాప్టర్‌లో కుప్పంకు బయల్దేరారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,581.52	1,579.33
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	815	272
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	1,957	264
సామర్థ్యం (టీఎంసీలు)	5.46	4.18

తాగి బండి నడిపితే కటకటాలే

ఆధునిక పరికరాలతో పరీక్షలు : ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ రంజిత్‌కుమార్ బండారు

బళ్లారి సిటీ, జూన్ 25: జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రమాదాల నియంత్రణ చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ రంజిత్ కుమార్ బండారు తెలిపారు. ఈ పరికరాల సాయంతో మద్యంతాగి బండినడిపేవారిని కటకటాల వెనక్కు పంపుతామన్నారు. నగరంలోని పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు దాదాపు 300 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 118మంది మరణించారని, 436మంది తీవ్రగాయాలపాలయ్యారన్నారు. ఈ రోడ్డుప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందులో భాగంగా ట్రాఫిక్ నియంత్రణకు స్పీడ్ లేజర్ గన్, మద్యం తాగి వాహనాలు నడిపేవారిని పరీక్షించేందుకు బ్రీత్ ఆల్కహాల్





స్పీడ్‌లేజర్ గన్, బ్రీత్ ఆల్కహాల్ ఎనలైజర్ పరికరాలను ప్రదర్శిస్తున్న ఎస్పీ

ఎనలైజర్ పరికరాలను సరఫరా చేశామన్నారు. ఇప్పటికే అధికారులు సిబ్బంది అందరికీ వీటిపై శిక్షణ ఇచ్చామన్నారు.

- స్పీడ్ లేజర్ గన్

స్పీడ్‌లేజర్ గన్ పరికరం పూర్తిగా డిజిటల్, అత్యాధునిక సాంకేతికతను కలిగి ఉంటుందన్నారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే ఈ పరికరం ఆటోమేటిక్‌గా తేదీ, స్థానం, వాహనం రిజిస్ట్రేషన్ రికార్డ్ చేస్తుందన్నారు. ఓవర్‌స్పీడ్‌తో డ్రైవింగ్ చేస్తున్నప్పుడు మొబైల్ వాడకం, వీలింగ్, రేసింగ్, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేయడం, ద్విచక్ర వాహనంలో ఇద్దరి కంటే ఎక్కువ మంది ఉండడం వంటి ట్రాఫిక్ నేరాలకు సంబంధించిన సమాచారాన్ని రికార్డుచేస్తుందన్నారు. ఈ పరికరాన్ని ఒకప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి సులభంగా తీసుకెళ్లగలమన్నారు. దీని ఆధారంగా సిగ్నల్ జంపింగ్, డ్రగ్స్, తాగి డ్రైవింగ్ చేయడం నిబంధనల ఉల్లంఘన తదితరాలపై కేసు నమోదు చేయవచ్చని ఆయన తెలియజేశారు. రోడ్డు భద్రతపై జిల్లా పోలీస్ శాఖ ప్రజలకు అవగాహన కల్పిస్తోందని ప్రజలు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. డ్రైవింగ్ చేసేటప్పుడు భద్రత కోసం హెల్మెట్, సీటు బెల్ట్ ధరించాలని తెలిపారు.

- బ్రీత్ ఆల్కహాల్ ఎనలైజర్

జిల్లాలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసు నమోదు చేసేందుకు బ్రీత్ ఆల్కహాల్ ఎనలైజర్ వినియోగిస్తున్నామన్నారు. మద్యం సేవించిన వ్యక్తి ఫోటోతో పాటు సమాచారాన్ని నమోదు చేస్తుందన్నారు. పరికరాన్ని ఊదడం, వాసన చూడడం నిరాకరించినప్పుడు కేసు నమోదు చేస్తామని ఎస్పీ రంజిత్‌కుమార్ బండారు తెలిపారు. అత్యవసర సేవల కోసం 112కి ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు పోలీసు సూపరింటెండెంట్ నవీన్‌కుమార్, డీఏఆర్ డీఎస్పీ తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

హక్కిపిక్కి సమాజంలో ప్రతి ఇంటా విద్యాభ్యాసం : ఎమ్మెల్యే

కంప్లి, జూన్ 25 : హక్కిపిక్కి సమాజంలో ప్రతి ఇంటా విద్యాభ్యాసం జరగాలని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ ఆకాక్షించారు. కంప్లి పట్టణంలోని 12వ వార్డులో వెలసిన తుల్జాభవాని అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయం తుంగభద్ర నది నుండి జలకలశాన్ని, అమ్మవారి భావచిత్రపటాన్ని తుల్జాభవాని ఆలయం వరకు భాజాభజంత్రీల మధ్య ఊరేగించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ హక్కిపిక్కి సమాజం అనగానే అక్కడుండే పోలీసు అధికారి పీసీబీ సీఐ డాక్టర్ బీఎస్ సుధాకర్ గుర్తుకు వస్తారని, 2002లో కంప్లి పట్టణంలో పోలీస్ స్టేషన్ ఎస్ఐగా విధులు నిర్వహించే సమయంలో ఎంతో మంది బట్టి సారాయిని నమ్ముకున్న హక్కిపిక్కి సమాజంలో తుల్జాభవాని ఆలయాన్ని ఏర్పాటు చేయడంద్వారా మార్పుతెచ్చారన్నారు. ఈ సమాజానికి చదువుపై అవగాహన కల్పించి ఆ సమాజంలో గుర్తుండిపోయే నాయకుడిగా నిలిచారన్నారు. అన్ని సమాజాలతో పాటు హక్కిపిక్కి సమాజం కూడా అన్ని రంగాల్లో ముందడుగు వేస్తుందని తెలిపారు. అనంతరం డాక్టర్ బీహెచ్ సుధాకర్ మాట్లాడుతూ ప్రతి యేటా తుల్జాభవాని దేవి ఆలయం పూజా కార్యక్రమం ఏర్పాటు చేసుకుని, ఈ సమాజ ప్రముఖులను ఒక చోటికి చే ర్చడం సంతోషించదగ్గ విషయమన్నారు. అనంతరం సమాజ ప్రముఖులు శికారి రాము మాట్లాడుతూ ఒకప్పుడు హక్కిపిక్కి సమాజం అనగానే ఎంతో దూరంగా వుంచేవారని, తమ నాయకుడు సుధాకర్ వల్ల తాము విద్యాభ్యాసంతోపాటు వివిధ రంగాల్లో రాణిస్తున్నామన్నారు. తెలిపారు. అనంతరం ముగ్గురికి భవాని శ్రీ అవార్డును ప్రసాద్ గోఖలే, శివరంజన్ సత్యంపేటే, రామ చంద్రాచారిలకు అవార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో రామప్ప కుందోళిగి, ఉలిగమ్మ, శ్రీనివాస్, బసవన గౌడ, మారెప్ప, మూకయ్య స్వామి, బట్ట ప్రసాద్, నారాయణ, శాంతిలాల్, పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణ కోసం మేయర్‌కు విజ్ఞప్తి



మేయర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

బళ్లారి సిటీ, జూన్ 25: బళ్లారి నగరంలోని బెంగళూరు రోడ్డు, కాళమ్మ వీధి, బ్రాహ్మణ వీధి, గోల్డ్‌స్మిత్ వీధులలోని రోడ్లను సుమారు 40అడుగుల మేర విస్తరించాలని యువసేన సోషల్ ఆక్షన్ క్లబ్ బెంగళూరు రోడ్డులోని ఏపీఎంసీ రోడ్డులో కార్పొరేషన్ మేయర్‌కు విజ్ఞప్తి చేసింది. ఎప్పుడో బ్రిటీష్ పాలనలో ఈ రోడ్డు సుమారు 30అడుగుల వెడల్పు ఉండేది. ఈ రోడ్ల మ్యాప్‌లు తహశీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయి. దుకాణాల యజమానులు, ఇళ్ళ యజమానులు రోడ్లను ఆక్రమించుకుని వాటిని చిన్న రోడ్డుగా మార్చారు. చట్టానికి అనుకూలంగా రోడ్డును విస్తరించి సుందరమైన రోడ్డు వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చేయాలని, నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని కోరారు. వినతి పత్రం సమర్పిస్తున్న సందర్భంగా యువ సేనా క్లబ్ అధ్యక్షులు మేకల ఈశ్వర్ రెడ్డి, కార్యకర్తలు కృష్ణ, బాషా, శ్రీనివాసరెడ్డి, మల్లప్ప, జగన్నాథం, నారాయణ అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుదారులకు అంబులెన్స్ సేవలు

సిరుగుప్ప, జూన్ 25 : బీపీఎల్ రేషన్ కార్డు లబ్ధిదారులకు ఉచితంగా అంబులెన్స్ సేవలు అందించాలని మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప సిరుగుప్ప తాలుకా ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్ గురునాథ్‌కు సూచించారు. సిరుగుప్ప పట్టణంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప, ప్రభుత్వాస్పత్రిని సందర్శించారు. సీజనల్ జ్వరాలు, డెలివరీ రోగులను బాగా చూసుకోవాలని ఆయన కోరారు. ఎమర్జెన్సీ సమయంలో అంబులెన్స్ పంపడానికి డబ్బులు అడిగే పరిస్థితి వదులుకోవాలని ఆయన సూచించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాశిబిరంలో ఆసనాలు వేస్తున్నఔత్సాహికులు

కంప్లి, జూన్ 25 : ప్రతి ఒక్కరు క్రమం తప్పకుండా ఉదయం సాయంత్రం వేళల్లో యోగాభ్యాసం చేయడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని, సుఖ జీవనం కొనసాగిస్తారని హెబ్బాళ మఠ నాగభూషణ శివాచార్యులు తెలిపారు. కంప్లి పట్టణంలో అంతర్రాష్ట్రీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని 40 రోజుల పాటు సన్నాపురం రోడ్డులోని శారదా పాఠశాలలో ఉచిత యోగా శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తుల సంపాదనపై ఎలా దృష్టి సారిస్తామో యోగాపై కూడా అలాగే దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం యోగా సంచాలకులు మోనేష్ మాట్లాడుతూ పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో జరిగే యోగా శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మోనేష్, అధ్యక్షులు కొట్రేష్, డీవీసుబ్బారావు, చంద్రమోహన్, చిత్రగార్, రత్నమ్మ, తిప్పేస్వామి, రామలింగప్ప, విరుపాక్షి, బ్రహ్మయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి: డీఎస్పీ



రాఘవేంద్ర మఠం హైస్కూలులో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ

కంప్లి, జూన్ 25 : యువతీయువకులు చెడు అలవాట్లకు దూరంగా వుంటే ఉత్తమ జీవితం గడపవచ్చని డీవైఎస్పీ ప్రసాద్ గోఖలే తెలిపారు. కుడితిని పట్టణంలో మంగళవారం రాఘవేంద్ర మఠం ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో మాదక ద్రవ్యాల నిరోధక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు మాదక ద్రవ్యాలకు దూరంగా వుండాలని, సిగరెట్, గుట్కా, గంజాయి లకు దూరంగా వుండాలని అప్పుడే ఉత్తమ జీవితం కొనసాగిస్తామన్నారు. అలాంటివి తమ చుట్టుపక్కల ప్రాంతాల్లో అమ్మినా వెంటనే పోలీసు శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు తమ ప్రాంతాల్లో తిరుగుతున్నా, ఇలాంటివి అమ్మకాలు చేపడుతున్నా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పట్టుదలతో దేన్నయినా సాధించవచ్చునన్నారు. వీరితో పాటు సీఐ విశ్వనాథ్ హిరేగౌడ, ఎస్ఐ విరుపాక్షి, హెచ్ఎం ద్రాక్షాయణి, పోలీసు సిబ్బంది ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



వ్యాధుల గురించి తెలియజేస్తున్న ఈవో బసప్ప

బళ్లారిరూరల్, జూన్ 25 : తాలుకాలోని వై కగ్గల్లు గ్రామంలో మంగళవారం ఈవో మడిగిన బసప్ప, గ్రామ పంచాయతీ ఆరోగ్యసిబ్బంది వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఇంటి పరిసరప్రాంతాల్లో శుభ్రంగా వుంచుకోవాలని, ఇళ్లలో నిల్వవుంచిన నీటిని తాగరాదని, వాటర్ ట్యాంకులను శుభ్రంగా వుంచుకోవాలన్నారు. శుభ్రత లేకపోవడం వలన కలరా, మలేరియా, డెంగ్యూ లాంటి వ్యాధులు వ్యాపించే అవకాశాలున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీఎంసీలో అపరిశుభ్రతపై ఆగ్రహం

- వారంలోగా డ్రైనేజీలు శుభ్రం చేయాలి
- ఏపీఎంసీ అధ్యక్షుడు కట్టెమనె నాగేంద్రప్ప



డ్రైనేజీలో పూడికను తొలగించాలని సూచిస్తున్న అధ్యక్షులు నాగేంద్రప్ప

బళ్లారి గాంధీనగర్, జూన్ 25: నగరంలోని వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్‌సమితిలో నెలకొన్న అపరిశుభ్రతపై అధ్యక్షులు కట్టెమనె నాగేంద్రప్ప సెక్రటరీ నంజుండస్వామిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏటా లక్షలాది రూపాయలు మార్కెట్ నిర్వహణ కోసం ఖర్చు చేస్తున్నా మార్కెట్‌లో శుభ్రత లేకపోవడంపై సెక్రటరీని నిలదీశారు. వారం రోజుల క్రితం నూతన ఏపీఎంసి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన మంగళవారం ఉదయం మార్కెట్ ప్రాంగణంలో అంతా కలియదిరిగారు. మార్కెట్‌లో ఎక్కడకు వెళ్ళినా వ్యాపారులు మార్కెట్ నిర్వహణ పూర్తిగా అధ్వాన్నంగా తయారైందని, తమ సమస్యలు పరిష్కరించే వారు లేరని ఆయన వద్ద వాపోయారు. ఏళ్ళతరబడి డ్రైనేజి కాలువల్లో పూడిక తొలగించక పోవడంతో వర్షం వచ్చిందంటే వర్షపు నీరంతా అంగళ్ళలోకి వస్తోందని, ధాన్యం అంతా తడిసిపోతోందని పేర్కొన్నారు. తద్వారా తాము నష్ట పోతున్నట్లు అధ్యక్షులు, ఉపాధ్యక్షుల వద్ద మొరపెట్టుకున్నారు. డ్రైనేజీ కాలువలో పూడిక తొలగించని కారణంగా రోజుల తరబడి కాలువల్లో నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోందని వివరించారు. మార్కెట్ లో పనిచేసే హమాలీలకు సరైన మౌలిక సౌకర్యాలు లేవని, తాగునీటి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్ళాల్సి వస్తోందని, తాగునీటి కోసం ఏర్పాటు చేసిన కొళాయిల్లో ఎపుడు నీళ్ళువస్తాయో కూడా తెలియడంలేదని హమాలీలు, కార్మికులు ఆయనకు వివరించారు. సమస్యలు ఆలకించిన అధ్యక్షులు నాగేంద్రప్ప వారం రోజుల్లోగా డ్రేనేజీల్లో పేరుకు పోయిన పూడిక తొలగించేలా చర్యలు చేపట్టాలని ఏపీఎంసి సెక్రటరీ నంజుండస్వామికి సూచించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడి వెంట ఉపాధ్యక్షులు కొళగల్లు హులిగప్ప, అసిస్టెంట్ సెక్రటరీ బసవరాజు, ఎర్రిగౌడ, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా క్యాంటీన్ ప్రారంభం అయ్యేనా?



ప్రారంభానికి నోచుకోని ఇందిరా క్యాంటీన్

కంప్లి, జూన్ 25 : కుడితిని బస్టాండు ముందు భాగంలో నూతనంగా నిర్మించిన ఇందిర క్యాంటీన్‌ను త్వరగా ప్రారంభించాలని హితరక్షణ సమితి అధ్యక్షుడు కామేష్ తెలిపారు. ఎన్నో రోజుల క్రితమే ప్రభుత్వాలు ప్రారంభించిన ఇందిరా క్యాంటీన్ పథకం అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వలన ఇప్పటికీ సిద్ధం కాలేదన్నారు. ఇలాంటి వాటిపై జిల్లా అధికారులు దృష్టి సారించాలన్నారు. కొన్నిచోట్ల ఇప్పటికీ పనులు ప్రారంభించలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు క్యాంటీన్‌పై దృష్టి సారించి త్వరగా ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు.

డ్రైఫ్రూట్స్‌తో వినాయకుడికి ప్రత్యేక పూజలు



కంప్లి, జూన్ 25 : కంప్లి పట్టణంలోని జోగి కాలువ వద్ద వున్న వరసిద్ధి వినాయకుడికి మంగళవారం సంకష్ట హర చతుర్థి సందర్భంగా డ్రైఫ్రూట్స్‌తో ప్రత్యేకాలంకరణ చేపట్టారు. బాదం, పిస్తా, తదితర వాటితో స్వామిని అలంకరించారు. ఈ సందర్భంగా భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ప్రతి నెలా సంకష్ట హర చతుర్థి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరుపుతామని ఆలయ కమిటీ పదాధికారులు తెలిపారు.

ఆగిన ఫుట్‌పాత్ పనులు

- కాంట్రాక్టర్లకు నోటీసులు
- అనుమతి కోసం పీడబ్ల్యూడీ అధికారుల పరుగులు

బళ్లారి గాంధీనగర్, జూన్ 25: ఎట్టకేలకు ప్రజా పనులశాఖ అధికారులు ఆంధ్రజ్యోతి కథనంతో మేల్కొన్నారు. ప్రజా పనులశాఖ తప్పిదాన్ని ఎత్తి చూపుతూ రెండు రోజులుగా ఆంధ్రజ్యోతి కథనాలు ప్రచురించడంతో ప్రారంభించిన పనులను ఆపివేశారు. మోకా రోడ్డులో కెఇబి సర్కిల్ నుండి కెఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌వరకు రూ 2.49కోట్లతో ఫుట్‌పాత్ నిర్మాణం పనులను ప్రజా పనులశాఖ చేపట్టింది. ఈ పనుల్లో ఎర్త్‌వర్క్‌కు వేస్ట్‌మట్టిని ఉప యోగిస్తున్నట్లు సోమవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో అధికారులు అప్రమత్తమై... వేస్ట్‌మట్టి స్థానంలో ఎర్రమట్టిని వేసి సరిదిద్దే ప్రయత్నం చేశారు. ఇంతలోగా పనులు చేపట్టిన రోడ్డు కర్ణాటక రోడ్ల అభివృద్ధి మండలి(కెఆర్‌డిసిఎల్)కి చెందిందని, వారి అనుమతి లేకుండా ప్రజా పనుల శాఖ కెకెడిబి నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేస్తున్నట్లు మంగళవారం మరో కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావడంలో ప్రజా పనుల శాఖ అధికారులు ఖంగుతిన్నారు. చేసిన తప్పును తెలుకుని కెఆర్‌డిసిఎల్ అనుమతికోసం పరుగులు దీశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఆంధ్రజ్యోతి కథనంతో ఫుట్‌పాత్ పనులు ఆగిపోయిన దృశ్యం

తాళం వేసిన ఇంట్లో చోరీ..!

రాయచూరు, జూన్ 25 : జిల్లాలోని మస్కి పట్టణంలో తాళం వేసిన ఇంట్లో పట్టపగలే చోరీ జరిగింది. ఈ సంఘటన మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. నగరంలో నివశిస్తున్న పత్రిక విలేఖరి హనుమేశ్ నాయక్ కుటుంబంతో కలిసి ఇంటికి తాళం వేసి వేరే ఊరు వెళ్లగా దుండగులు ఇంటి తాళం విరగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. తులం బంగారం 20 తులాల వెండి ఇతర ఆభరణాలు రూ.30 వేలు నగదు దోచుకెళ్లారు. హనుమేశ్ నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మస్కి పోలీసులు కేసు నమోదు చేశారు. సంఘటన స్థలాన్ని సర్కిల్ ఇన్‌స్పెక్టర్, క్రైం సబ్ ఇన్‌స్పెక్టర్‌లు పరిశీలించారు.

హోసూరు జోన్

దివ్యాంగులకు బస్‌పాసుల పంపిణీ



పాసులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ సరయు

హోసూరు, జూన్ 25: కృష్ణగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో మంగళవారం దివ్యాంగుల సంక్షేమ శాఖ తరఫున 270మందికి ఉచిత బస్సు పాసులను కలెక్టర్ కె.ఎం.సరయు అందజేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ 160 మంది అంధులకు, 86 మంది చేతి, కాళ్ల వికలాంగులకు, 24 మంది చెవిటి దివ్యాంగులకు మొత్తం 270మందికి ప్రయాణ రాయితీ కార్డులు అందజేశారు. కార్యక్రమంల్లో జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి మురుగేశన్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం.. రూ.13 వేల జరిమానా

హోసూరు, జూన్ 25: రైతుల మార్కెట్ పూల మార్కెట్ బస్టాండ్, దుకాణాల్లో నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగ ంపై ఉద్యోగుల బృందం సర్వే నిర్వహించింది. కార్పొరేషన్ పరిధిలోని దుకాణాల్లో 13 కిలోల నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులు, నిషేధిత ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. వ్యాపారులకు అధికారులు రూ.13 వేలు జరిమానా విధించారు. పూల మార్కెట్ ప్రాంతంలో ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయంగా క్లాత్ బ్యాగ్‌లు వినియోగించాలని వ్యాపారస్తులకు సూచించారు.

పోషాకాహార కేంద్రాలకు క్వెస్ట్ సర్టిఫికెట్లు

ఎంజీఆర్ పౌష్టికాహార కార్యక్రమంకింద ఉత్తమ పాఠశాలల ఎంపిక

హోసూరు(కృష్ణగిరి), జూన్ 25: సాంఘిక సంక్షేమం తరఫున కృష్ణగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పోషకాహార కేంద్రాలను బాగా నిర్వహిస్తున్న వారికి క్వెస్ట్ సర్టిఫికెట్‌లు ప్రదానం చేశారు. కావేరిపట్టణం, మద్దూరు పంచాయతీ యూనియన్ ప్రాథమిక పాఠశాల, కృష్ణగిరి మున్సిపల్ హైస్కూల్ పాఠశాలల్లో నిర్వహిస్తున్న పోషకాహార కేంద్రాలకు క్వెస్ట్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కృష్ణగిరి జిల్లాలో 2022-23 సంవత్సరానికి సంబంధించి స్వచ్ఛమైన పరిశుభ్రంగా నిర్వహించబడుతున్న పాఠశాల పోషణ కేంద్రాలను ఎంపిక చేశారు. కావేరిపట్టణం యూనియన్, వెలంపట్టి పంచాయతీ యూనియన్ ప్రాథమిక పాఠశాల, మద్దూరు పంచాయతీ యూనియన్ అదికనూరు పంచాయతీ యూనియన్ ప్రాథమిక పాఠశాల, కృష్ణగిరి మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న 3 పోషకాహార కేంద్రాలకు ఐఎస్‌ఓ సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. కుప్పంరోడ్, ప్రభుత్వ మునిసిపల్ హైస్కూల్ మున్సిపాలిటీ తరఫున జిల్లా మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, జిల్లా కలెక్టర్ కె.ఎం.సరయు, ఇంటర్వ్యూ అసిస్టెంట్ జి.వి.వెంకటేశన్, జిల్లా అభివృద్ధి అధికారులు తంగదురై, తదితర అధికారులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న అధికారులు

విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలి

- రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడ



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే దద్దల బసనగౌడ

రాయచూరు, జూన్ 25 : ఖరీఫ్ సీజన్‌లో సాగు పనులు ముమ్మరంగా ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు కావల్సిన విత్తనాలు,ఎరువులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలని రాయచూరు రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడ అన్నారు. మంగళవారం జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన త్రైమాసిక కేడీపీ సభకు అధ్యక్షత వహించి ఆయన మాట్లాడారు. జిల్లాలో పెద్ద ఎత్తున సాగు పనులు ప్రారంభమయ్యాయని వర్షాలు సహితం ముమ్మరంగా కురిసిన నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వారి అవసరానికి అనుగుణంగా ఎరువులు విత్తనాలు అన్ని రైతు సంపర్క కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలోని 5 రైతు సంపర్క కేంద్రాల్లో అవసరమైన విత్తనాలు అందుబాటుల్లో ఉంచామని జిల్లాలో 55 శాతం సాగు పనులు ప్రారంభమయ్యాయని వర్షాలు తగినంత కురుస్తున్న నేపథ్యంలో రైతులు సాగు పనులు వేగవంతం చేస్తున్నట్లు అందుకు అనుగుణంగా తాము విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచుతున్నట్లు సభకు వివరించారు. ఇప్పటి వరకు నిల్వ ఉన్న వాటిలో 308 క్వింటాళ్ల వరి విత్తనాలు అందుబాటులో ఉండగా, వాటిలో 228 క్వింటాళ్లు ఇప్పటికే పంపిణీ చేశామన్నారు. కందులు 195.6 క్వింటాళ్ల నిల్వ ఉంచగా 162.05 క్వింటాళ్ల పంపిణీ చేశామన్నారు. దీంతో పాటు సజ్జ 2.1 క్వింటాళ్లకు గాను 1.89 క్వింటాళ్ల రైతులకు అందజేశామన్నారు. రసాయనిక ఎరువుల విషయంలో 13,939 మెట్రిక్ టన్నులు అవసరమైనట్లు అంచనా వేయగా 20,179 మెట్రిక్ టన్నులను నిల్వ ఉంచినట్లు అధికారులు వివరించారు.

గుంతలమయమైన రోడ్డుకు మరమ్మతులు

సిరుగుప్ప, జూన్ 25: జాతీయ రహదారిలో వర్షం కారణంగా ఏర్పడిన రహదారి గుంతలను ఎస్ఐ తిమ్మన్న నాయక ఆధ్వర్యంలో పూడ్చి మరమ్మతులు చేశారు. సిరుగుప్ప తాలుకాలో టెక్కలకోట నుంచి దడే సూగూరు గ్రామం వరకు 11 కిలోమీటర్ల జాతీయ రహదారి పనులకు రూ. 118 కోట్ల నిధులు విడుదలయ్యాయి. ఆ పనులు చేపట్టిన ఒక కాంట్రాక్టర్ అరకొరగా పనులు చేసి నష్టం వచ్చిందని పనులను నిలిపివేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆ పనులు జరుగక అలాగే వదిలేయడంతో భారీ వర్షాలకు జాతీయ రహదారి మట్టి రోడ్డుగా మారింది. ఎక్కడపడితే అక్కడ గుంతలు పడ్డాయి. జాతీయ రహదారి అధికారులు ఈ గుంతలను పూడ్చేపనులను కూడా పట్టించుకోకపోవడం సిగ్గుచేటుగా మారింది. ఎన్‌హెచ్ అధికారులు ఈ విషయంపై నిర్లక్ష్యం వహించడంతో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉండడంతో ఎస్ఐ తిమ్మన్న నాయక్ జేసీబీ యంత్రాల ద్వారా గుంతలను పూడ్చేపనులకు శ్రీకారం చుట్టారు.

ముస్లింల పనులు చేయాల్సిందే

● సహచర మంత్రి ఖండ్రెపై మరో మంత్రి జమీర్ వివాదాస్పద వ్యాఖ్య

బెంగళూరు, జూన్ 25(ఆంధ్రజ్యోతి): సహచర మంత్రి అని కూడా చూడకుండా రాష్ట్ర వక్ఫ్, హౌసింగ్‌శాఖ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బీదర్‌లో మంగళవారం జరిగిన వక్ఫ్ అదాలత్‌లో మంత్రి జమీర్ అహ్మద్ మాట్లాడుతూ అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె పట్ల తీవ్రంగా వ్యాఖ్యానించారు. కేవలం ముస్లిం ఓట్లతోనే ఈశ్వర్‌ఖండ్రె కుమారుడు సాగర్‌ఖండ్రె బీదర్‌లో ఎంపీగా గెలిచారన్నారు. ముస్లింల పనులను తలవంచి చేయాలన్నారు. అటవీప్రాంతాన్ని శ్మశానవాటికకు కేటాయించే విషయంలో జాప్యం జరుగుతోందని ఓ వ్యక్తి విన్నవించిన మేరకు మంత్రి జమీర్ పైవిధంగా వ్యాఖ్యానించారు. తాను ఖండ్రెతో మాట్లాడతానని, సర్వే నెంబరు 93లో స్మశానవాటికకు కేటాయించేలా చర్యలు తీసుకుంటా నన్నారు. సమీపంలో ఎక్కడా స్థలం లేదా..? అంటూ ఆరా తీశారు. చాలాకాలంగా అక్కడే సమాధులు చేస్తున్నామని వివరించారు. ఇదే సందర్భంలోనే మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అదాలత్‌లో వక్ఫ్ మంత్రి రహీంఖాన్, ఎమ్మెల్సీ అబ్దుల్ జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.


వక్ఫ్ అదాలత్‌లో మంత్రి జమీర్‌అహ్మద్‌ఖాన్ తదితరులు

మాజీ భార్య హత్య


పద్మమ్మ మృతదేహం


ఘటనా స్థలంలో పోలీసులు

బెంగళూరు, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యలతో జరిగిన గొడవల కారణంగా విడాకులు తీసుకున్న భార్యను మాజీ భర్తతోపాటు రెండోభార్య కుమారుడు దారుణంగా హత్య చేసిన సంఘటన శిడ్లఘట్ట తాలూకా సొణ్ణేనహళ్ళిలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. ఈ ఘటనలో పద్మమ్మ (40) మృతి చెందారు. ఆమె మాజీ భర్త మునిరెడ్డి (58) హతమార్చిన అనంతరం నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయారు. హత్యకు సహకరించిన మునిరెడ్డి రెండోభార్య కుమారుడు 20ఏళ్ల గిరీశ్ పరారీ అయ్యారు. మునిరెడ్డి, పద్మమ్మ ఒకప్పుడు భార్యాభర్తలు. కుటుంబ గొడవలతో వారు విడాకులు తీసుకున్నారు. వారికి ఇద్దరు కుమారులు ఉండేవారు. మునిరెడ్డికి చెందిన ఆస్తులు, భూములను పద్మమ్మకు సగం పంచారు. ఇటీవలే పద్మమ్మ కుమారులు ఇద్దరూ ఓ ప్రమాదంలో మృతి చెందారు. ప్రసుత్తం ఆమె ఒంటరిగా జీవనం సాగిస్తున్నారు. విడాకుల తర్వాత మునిరెడ్డి మరో వివాహం చేసుకున్నాడు. ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. పద్మమ్మ జీవనం కోసం ఇచ్చిన భూమిని వాపసు ఇవ్వాలని మునిరెడ్డి ఇటీవల పలు మార్లు గొడవపడ్డాడు. ఒంటరిగా ఉన్న నీకు భూములు, ఆస్తులు ఎందుకని ప్రశ్నించారు. ఆమె ఆస్తులను వాపసు ఇచ్చేందుకు విముఖత చూపడంతో మునిరెడ్డి, రెండోభార్య కుమారుడు గిరీశ్‌లు పద్మమ్మ ఇంటికి వెళ్లి మారణా యుధాలతో దాడి చేసి హతమార్చారు. శిడ్లఘట్ట గ్రామీణ సీఐ శ్రీనివాస్, ఎస్సై సతీశ్‌లు సంఘటనా స్థలాన్ని పరి శీలించి కేసు నమోదు చేసుకున్నారు. ఎస్పీ డీఎల్ నాగేశ్, ఏఎస్పీ రాజా ఇమాంఖాసిమ్, డీఎస్పీ మురళీధర్‌లు సంఘటనా స్థలాన్ని సందర్శించారు.

చెరువులలో నీరు .. కట్టకింద భూములు బీడు


ఓ వైపు పచ్చదనం మరోవైపు బీడుగా ఉన్న చెరువు కింద భూమి

చేళూరు, జూన్ 25: ముంగారు వర్షాలు ప్రారంభం కావడంతో వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. ఏరువాక పున్నమి రోజున రైతన్నలు వ్యవసాయ పరికరాలకు పూజలు చేసి దుక్కులు చేపట్టారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రతి గ్రామానికి ఒక చెరువు, ఓ దేవాలయం తప్పనిసరిగా ఉండేది. పెద్దగ్రామంలో నీటి వనరులు ఉన్నచోటున రెండు చెరువులు తవ్వించి గ్రామీణ ప్రాంత రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉండేవి. వర్షా కాలంలో గుట్టలు, కొండల ప్రాంతాలనుంచి నీరు రాజకాలువల ద్వారా చెరువులలోకి చేరేలా ఏర్పాటు చేశారు. పెద్ద చెరువులనుంచి సమీపంలోని చిన్నచెరువులకు నీరు చేరేది. చెరువులలోకి నీరు వృథా కాకుండా తూముల ద్వారా సరఫరా అయ్యేలా ఉండేది. ఇటీవల అరకొరగా కురిసిన వర్షాలతో చేళూరు తాలూకాలో చెరువులలోకి కొంతమేర నీరు చేరింది. పూర్తిస్థాయిలో చెరువులు నిండితేనేగానీ తూముల ద్వారా నీరు సరఫరా అవుతుంది. ఈ పరిస్థితుల్లో దుక్కులు ప్రారంభించినా తదుపరి కార్యాచరణకు పూర్తిస్థాయిలో సాగు కావాలంటే చెరువుల నుంచి నీరు విడుదల కావాల్సిందే. చెరువులు కొంతమేర నీరు ఉన్నా చుట్టుపక్కల బావులు, బోర్లలో భూగర్భజలాలు ఆశాజనకంగా ఉంటాయి. అయితే రైతులందరికీ లక్షలాదిరూపాయలు ఖర్చు చేసి బోర్లు వేయించుకునే స్తోమత ఉండదు. దీంతో చాలావరకు వర్షాధారంపైనే ఆధారపడడం లేదా చెరువునీటిపై ఆధార పడుతుంటారు. ఈ తరుణంలో చెరువులలో ఓ మోస్తరు నీరు ఉన్నా చెరువు ఆయకట్టు భూముల్లో పూర్తిస్థాయిలో సాగు పనులు ఊపందుకోలేదు. కట్టకింద భూములు బీడు బారకుండా ఉండాలంటే రైతాంగాన్ని ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నదాతలు కోరుతున్నారు.

భూమాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయండి

బంగారపేట, జూన్ 25: పేదల ఇళ్లస్థలాలకోసం కేటాయించిన భూమిని భూమాఫియా కబ్జాకు ప్రయత్నిస్తున్నా రెవెన్యూశాఖ మాత్రం చోద్యం చూస్తోందని జీవిక గ్రామీణాభివృద్ధి సంస్థ రాష్ట్ర సంచాలకులు డాక్టర్ రామచంద్రప్ప విచారం వ్యక్తం చేశారు. పట్టణంలోని తాలూకా కార్యాలయం వద్ద ఆర్ఎఫ్ఎఫ్, జీవిక గ్రామీణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సాంకేతిక నిరసన చేపట్టారు. తాలూకాలోని దొడ్డవన్నాండహళ్ళి గ్రామ సర్వే 36లో 1991లో పేదలకోసం ఇంటి స్థలాలను కేటాయించిందన్నారు. అయినా రెవెన్యూశాఖ అధికారులు మాత్రం సదరు స్థలాన్ని గుర్తించి పేదలకు కేటాయించడంలో జాప్యం చేస్తున్నారన్నారు. దళిత రైతుసేన రాష్ట్ర అధ్యక్షుడు హుణసనహళ్ళి వెంకటేశ్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖ నిర్లక్ష్యం కారణంగా పేదలకు ఇంకా ఇంటిస్థలాలు అందలేదన్నారు. సర్వే 39లో 234 ఎకరాలు ఉండగా అందులో కొంత ఆశ్రయ పథకం కింద పేదలకు భూమిని కేటాయించారన్నారు. ఇందుకు బ్లూప్రింట్ సిద్ధమైనా కేటాయింపులు చేయలేదన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పేదలకు ఇళ్లస్థలాలు అందలేదన్నారు. గతంలో కొంతమంది రియల్టర్‌లు సదరు స్థలంలో శివలింగాన్ని ప్రతిష్ఠించేందుకు ప్రయత్నించి స్థానికంగా వైషమ్యాలకు ప్రయత్నించారని అయితే కామసముద్ర పోలీసుల జోక్యంతో సమస్య పరిష్కారమైందన్నారు. ఇకనైనా రెవెన్యూశాఖ అధికారులు స్పందించి భూమాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. ఈ సందర్భంగా కళాకారుడు రాష్ట్ర కళామండలి సంచాలకులు యల్లప్ప, డీఎస్ఎస్ రవిచంద్ర, తాలూకా అధ్యక్షుడు ఎం తిప్పణ్ణ, శంకరప్ప, బీరప్ప తదితరులు పాల్గొన్నారు.


రెవెన్యూశాఖ అధికారులకు వినతి పత్రం ఇస్తున్న గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రతినిధులు

అపోలోలో రోబోటిక్ రేడియో థెరపీ

బెంగళూరు, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ఎక్స్‌రే అనుబంధ చికిత్సా సాధనాలు సమకూర్చడంలో పేరొందిన అక్యూరె సంస్థతో అపోలో కేన్సర్ సెంటర్ సహకారం కుదుర్చుకుంది. తద్వారా రోబోటిక్, స్టీరియోటాక్టిక్ థెరపీ శిక్షణను ఆరంభించింది. ఇండియన్ స్కూల్ ఆఫ్ రోబోటిక్స్ స్టీరియోటాక్టిక్ రేడియోసర్జరీ శిక్షణా కేంద్రం పేరిట బెంగళూరు, చెన్నై అపోలో కేంద్రాలలో ఏర్పాటు చేస్తారు. అంకాలజిస్టులు, రేడియాలజిస్టులకు సమగ్ర శిక్షణ ఇవ్వనున్నారు. తద్వారా వైద్యవిద్యారంగంలో కీలకమైన ప్రగతి సాధించినట్టు కానుందని అపోలో ఆసుపత్రుల ఆంకాలజిస్ట్ దినేశ్ మాధవన్ అభిప్రాయపడ్డారు. కేన్సర్ చికిత్సలకు ఆధునిక యంత్రాల ఉపయోగంతో నొప్పి తగ్గించడం, వేగవంతంగా కోలుకునేలా అవకాశం ఉంటుందన్నారు. రోబోటిక్ రేడియో సర్జరీ ముఖ్యులు శ్రీధర్ అభిప్రాయం మేరకు రేడియోథెరపీలో నైపుణ్యత విజ్ఞానాన్ని పెంచేందుకు ఇదో మార్గదర్శకమన్నారు. రోబోటిక్ రేడియో సర్జరీ విధానంలో 5వేలకుపైగా రోగులకు నయం చేశామన్నారు. అక్యూరె సంస్థ సీఈఓ చైర్మన్ సుజేన్ వింటర్ మాట్లాడుతూ సైబర్‌నైఫ్ ఎస్7 సిస్టమ్ విస్తరణ ద్వారా నిపుణులకు శిక్షణ, బాధితులకు వేగవంతమైన చికిత్సలు సాధ్యం కానున్నాయన్నారు.

ఏఎంఆర్ సమస్యతో తీవ్ర జబ్బులు

బెంగళూరు, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): యాంటి మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) సమస్యతో తీవ్రమైన జబ్బుల బారిన పడుతున్నారని ప్రపంచవ్యాప్తంగా జాగృతి అవసరమని యూరో ఏషియా 2024 సమీక్షలో నిపుణులు అభిప్రాయపడ్డారు. ఏఎంఆర్‌పై బెంగళూరులో సదస్సు జరిగింది. దక్షిణ ఏసియా నిపుణుడు రాజేశ్‌పాండే అభిప్రాయం మేరకు 2019లో ఏఎంఆర్ ఆరోగ్య సమస్యతో దేశంలో 49లక్షలమంది మృత్యువాత చెందారన్నారు. 2050 నాటికి ఏటా కోటిమంది మృతి చెందే అవకాశం ఉందన్నారు. సాధారణ జబ్బులకు వైద్యుల అభిప్రాయం లేకుండానే మందులు వాడుతున్నారని అవి శరీరంలో రోగనిరోధకశక్తిని తగ్గించివేస్తున్నాయన్నారు. ఈ ప్రభావం తర్వాత వచ్చే రోగాలపై పెను ప్రభావం చూపుతోందన్నారు. ఏఎంఆర్ పరిష్కారానికి పలు విధానాలు పాటించాల్సి ఉందన్నారు. ఐఎస్‌సీసీఎం జనరల్ సెక్రటరీ భరత్ జగియాసి మాట్లాడుతూ ఎయిడ్స్, మలేరియాలకంటే ఎక్కువ ప్రమాణంలో ఏఎంఆర్ ద్వారా చావులు నమోదవుతున్నాయన్నారు. ఏఎంఆర్ తీవ్రమైన సమాజంలో చైతన్యం కలిగించేందుకు ప్రైవేట్ భాగస్వామ్యం కూడా అనివార్యమన్నారు. పరిశోధనా సమితి చైర్మన్ ప్రదీప్ భట్టాచార్య అభిప్రాయం మేరకు చిన్నపిల్లలనుంచి 60ఏళ్ల దాటినవారి వరకు హృద్రోగం, శ్వాసకోశ, మధుమేహం, అల్జీమర్స్, పక్షవాతం, కిడ్నీ సమస్యలు వచ్చేందుకు మోతాదుకు మించి యాంటి బయోటిక్స్ వాడడం కారణంగా ఉందన్నారు. నిపుణులైన వైద్యుల సలహా లేకుండా విచ్చలవిడిగా మందులు వాడరాదన్నారు. సమీక్షలో పలువురు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

ప్రాస్టేట్ కణజాలాన్ని తగ్గించేందుకు రెజమ్ చికిత్స

బెంగళూరు, జూన్ 25(ఆంధ్రజ్యోతి): ప్రొస్టాటిక్ హైపర్ ప్లాసియా చికిత్సలకోసం రీగల్ ఆసుపత్రిలో రెజమ్ సర్జికల్ విధానాన్ని పాటించారు. రీగల్ ఆసుపత్రి సీనియర్ యూరాలజిస్ట్ సూరిరాజన్ తెలిపిన మేరకు 68ఏళ్ల రోగిపై ప్రయోగాత్మ కంగా చికిత్సలు చేశామన్నారు. రెజమ్ పద్ధతి అనస్థీషియా విధానంతో నిర్వహించబడుతుందన్నారు. ప్రొస్టేట్‌లోకి ఎండోస్కోపి ద్వారా సూదిని ప్రవేశపెట్టి అధిక ఉష్ణోగ్రత, నీటి ఆవిరి నేరుగా కణజాలంలోకి పంపిణీ చేస్తామన్నారు. రోగులకు నొప్పి లేకుండా చికిత్స అందించే విధానమని ఒక్కరోజులోనే ఆసుపత్రి నుంచి డాశ్చార్జ్‌కు అవకాశం ఉంటుందన్నారు. సాంకేతిక విధానాలతో యూరలాజికల్ సమస్యలపై రీగల్ ఆసుపత్రిలో చికిత్సలు అందిస్తున్నామన్నారు.

మండ్యలో సాహిత్య సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

▸▸ ముఖ్యమంత్రి సిద్దరామయ్య పిలుపు

బెంగళూరు, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): మండ్యలో అఖిల కర్ణాటక సాహిత్య సమ్మేళనం అర్థవంతంగా జరిపేందుకు కార్యాచరణ కొనసాగించాలని సీఎం సిద్ధరామయ్య సూచించారు. డిసెంబరు 20నుంచి మూడు రోజులపాటు జరిగే సాహిత్య సమ్మేళనంపై మంగళవారం సన్నాహక సభ జరిపారు. కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ మహేశ్‌జోషి, మండ్య జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి చలువరాయస్వామితోపాటు మండ్య జిల్లా ఎమ్మెల్యేలు ముఖ్యులుగా పాల్గొన్నారు. గతంలో జూన్‌లోనే సమ్మేళనం జరపాలని తీర్మానించినా ఎన్నికల కోడ్ ఉన్నందున కార్యాచరణ కొనసాగించలేకపోయినట్టు సీఎం తెలిపారు. సమ్మేళనానికి రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాలవారు విదేశీ కన్నడిగులు పెద్దసంఖ్యలో పాల్గొంటున్నందున ఒక సంబరంలో జరపాలని తీర్మానించారు. మండ్యలో 48వ సాహిత్య సమ్మేళనం 1974లో జయదేవి తల్లి లిగాడ అధ్యక్షతన, 1994లో 63వ సమ్మేళనాన్ని డాక్టర్ చతురంగ అధ్యక్షతన జరిగిందన్నారు. ప్రస్తుతం మండ్యలో మూడు రోజులపాటు నిర్వహించే మూడో సమ్మేళనం మరింత విజయవంతం చేద్దామని నిర్ణయించారు. కన్నడ సంస్కృతిశాఖ కార్యదర్శి అజయ్‌నాగభూషణ్‌తోపాటు కన్నడ సాహిత్య పరిషత్ కార్యదర్శులు రామలింగ శెట్టితోపాటు ఇతర అధికారులు పలువురు పాల్గొన్నారు.

గ్రంథాలయ భవనం ప్రారంభం

▸▸ స్త్రీశక్తి సంఘాలకు సహాయధనం, రుణాలు పంపిణీ

మహదేవపుర, జూన్ 25: శాసనసభ నియోజకవర్గ పరిధిలోని బొమ్మేనహళ్ళిలో తాలూకా పంచాయతీ భవన ఆవరణలో దివ్యాంగుల వివిధ ఉద్దేశ్య కేంద్రం, గ్రంథాలయాన్ని ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి ప్రారం భించారు. మండూరు గ్రామంలో ఘనత్యాజ్య నిర్వహణ కేంద్రాన్ని ప్రారం భించారు. ఇదే సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలకు తాలూకా పంచాయతీ నుంచి మిక్సీ, కుక్కర్, జమఖానా, స్త్రీశక్తి సంఘాలకు సహాయధనం, రుణాల చెక్కులను అందచేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు నటరాజ్, ముఖ్యులు వేణు, ఈఓ వసంతకుమార్, పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ప్రారంభంలో ఎమ్మెల్యే మంజుళా లింబావళి తదితరులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

బాల గంధర్వ (జయంతి)



మరాఠీ గాయకుడు 'పద్మభూషణ్' గ్రహీత బాలగంధర్వ 1888 జూన్ 26న మహా రాష్ట్రలోని సాంగ్లి జిల్లా నాగ ఠానె తాలూకాలో జన్మించారు. అసలు పేరు నారాయణ్ శ్రీపద్ రాజహన్స్. గాయకుడి గానే కాక నాటక రంగంలోనూ రాణించారు. అనేక మరాఠీ నాటకాలలో స్త్రీ పాత్రలలో నటించి తనదైన గుర్తింపు పొందారు. స్వాతంత్ర్య సమరయోధుడు లోక మాన్య తిలక్‌చే 'బాల గంధర్వ'గా మెప్పు పొందారు. 25కుపైగా ప్రముఖ సామాజిక నాటకాలలో నటించి ప్రజల మన్ననలు అందుకున్నారు. 1955లో రాష్ట్రపతి నుంచి సంగీత నాటక అకాడమీ అవార్డు పొందారు. 1967 జూలై 15న కన్నుమూశారు.

పెర్ల్ ఎస్ బక్ (జయంతి)



అమెరికా దేశానికి చెందిన ప్రముఖ రచయిత్రి పెర్ల్ సిడెన్ స్ట్రైకర్ బక్ 1892 జూన్ 26న జన్మించారు. ఆమె రచించిన 'ది గుడ్ ఎర్త్' నవలకు 1932లో పులిట్జర్ పురస్కారం దక్కింది. సాహిత్యానికి నోబెల్ పురస్కారం పొందిన తొలి అమెరికా రచయిత్రిగా గుర్తింపు పొందారు. మహిళా హక్కులు, మైనారిటీ గ్రూప్‌లకు న్యాయవాదిగా వ్యవహరించారు. 1973 మార్చి 6న కన్నుమూశారు.

మన్‌ప్రీత్‌సింగ్ (పుట్టినరోజు)



హాకీ క్రీడాకారుడు, భారత జాతీయ హాకీ జట్టు కెప్టెన్ మన్‌ప్రీత్ సింగ్ పవార్ 1992 జూన్ 26న పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లో జన్మించారు. 19వ యేట భారతజట్టు తరపున 2011లో హాకీలో ఆడారు. 2012 సమ్మర్ ఒలింపిక్స్‌లోనూ భాగస్వామ్యులయ్యారు. 2014లో ఏషియన్ జూనియర్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచారు. ఏషియన్ గేమ్స్, కామన్వెల్త్ గేమ్స్ లలో వరుసగా బంగారు, రజత పతకాలు పొందారు. 2017 నుంచి హాకీజట్టు కెప్టెన్‌గా కొనసాగుతున్నారు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యపతకం సాధించారు. 2019లో ఎఫ్ఐహెచ్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు, 2021లో ఖేల్‌రత్న అవార్డు, ఇతరత్రా పురస్కారాలు అందుకున్నారు.

కన్నకొడుకే కడతేర్చాడు..

పావగడ, జూన్ 25 : ఆంధ్రాలోని మడకశిర మండల పరిధిలోని ఎల్లోటి గ్రామానికి చెందిన వడ్డె చంద్రక్క హత్య కేసులో ఆమె కన్న కొడుకే హం తకుడని ప్రాథమిక విచారణలో తేలినట్లు పావగడ పోలీసుల తెలిపారు. పావగడ సీఐ సురేష్ మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మడకశిర మండలం ఎల్లోటి గ్రామానికి చెందిన వడ్డె చంద్రక్కను ఈ నెల 20 వతేదీన పావగడ సరిహద్దు ప్రాంతమైన మాచరాజన హళ్లి అటవీ ప్రాంతంలో గొంతుకోసి నగదు, బంగారం దోచుకెళ్లిన సంఘటన తెలిసిందే. పావగడ పోలీసులు తమదైన శైలిలో దర్యాప్తు చేపట్టారు. ఆమె కొడు కు, కోడలిపై అనుమానంతో లోతుగా విచారణ చేపట్టగా కొడుకే హంతకుడని తేలింది. మృతురాలు చంద్రక్కకు పదేళ్ల క్రితం ప్రభుత్వం ఐదెకరాల భూమిని పంపిణీ చేసింది. ఆమె ఆ భూమిని తన కుమార్తెకు రాసిస్తానని చెబుతుండేది. అయితే ఆ భూమిని తనకు ఇవ్వాలని కొడుకు ఆంజనేయులు తల్లిని తరచూ కోరుతుండేవాడు. చివరకు చంద్రక్క తనకు పొలం రాసివ్వదని పగబట్టిన కొడుకు ఆంజనేయులు, పావగడ తాలూకా సూర్య నాయకనహళ్లికి చెందిన తన బావమరిది ప్రభాకర్‌తో కలిసి పథకం వేశాడు. గురువారం ఉదయం తన పొలానికి వెళ్లిన చంద్రక్క కాళ్లను పట్టుకుని, కన్న కొడుకే గొంతుకోసి శవాన్ని అటవీ ప్రాంతంలో పడేశాడు. ఆమె వద్ద ఉన్న నగదు, చెవికి ఉన్న కమ్మలు కూడా లాక్కెళ్లాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదుచేసి నిందితులను జైలుకు తరలించినట్లు సీఐ సురేష్ వివరించారు.

కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలి

- ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ, జూన్ 25 : మనిషి అవయవాల్లో కళ్లు ఎంతో ప్రధానమైనవని వాటిని ఆరోగ్యంగా కాపాడుకోవాల్సిన బాధ్యత ఎవరికివారిదేనని ఎమ్మెల్యే వెంకటేశ్ తెలిపారు. తాలూకా పరిధిలోని వైఎన్ హొసకోటలో జిల్లా ఆరోగ్య కార్యాలయం, సిద్దార్థ వైద్య కళాశాల, శారదాదేవి కంటి ఆసుపత్రి, ఇన్ఫోసిస్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కంటి వైద్య శిబిరాన్ని ఆయన జ్యోతి వెలిగించి మాట్లాడారు. అలాగే తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తుపై నిఘా ఉంచి వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాలని పావగడ జపానందస్వామి తెలి పారు. విద్యార్థులకు అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాది భగ వంతప్ప, కాంగ్రెస్ నాయకులు సుదేష్‌బాబు, షంబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మొదటిఘాట్‌లో అదుపుతప్పిన కారు

- కర్ణాటక భక్తులకు స్వల్పగాయాలు

తిరుమల, జూన్ 25(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటిఘాట్‌లో మంగళవారం ఓ కారు అదుపుతప్పింది. అదృష్టవశాత్తు కారులోని భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. కర్ణాటకకు చెందిన ఓ కుటుంబం శ్రీవారి దర్శనం ముగించుకుని మంగళవారం సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. మార్గంలోని 26వ మలుపు వద్ద కారు ఒక్కసారిగా అదుపుతప్పి కుడివైపునున్న చిన్న పాటి గట్టును ఢీకొంది. వేగం అదుపుకాకపోవడంతో రోడ్డు పక్కనే ఉన్న చిన్న గుంతలోకి వెళ్లి ఆగిపోయింది. అదృష్టవశాత్తు కారులోని ఐదుగురు భక్తులు స్వల్పగాయాలతో సురక్షితంగా బయటపడ్డారు.


ప్రమాదానికి గురైన కారు

వైభవంగా కరగ ఉత్సవం


పురవీధులలో కరగ ఉత్సవం

శిడ్లఘట్ట, జూన్ 25: పట్టణంలోని గ్రామ దేవత గంగమ్మ దేవి ఆలయంలో కొలువైన ద్రౌపదమ్మదేవి ఐదో వార్షిక కరగ మహోత్సవం వైభవంగా జరిగింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు కరగ ఊరేగింపు పురవీధులలో సాగింది. ముళబాగిలుకు చెందిన నాగరాజ్ కరగను ధరించి సాగారు. భక్తులు ఆయనకు భక్తిశ్రద్ధలతో స్వాగతించారు. ప్రత్యేక కూడ ళ్లలో నృత్యం ఆకట్టుకుంది. అంతకుముందు గంగమ్మ దేవాలయంలో గంగమ్మ, ద్రౌపదమ్మ దేవికి ప్రత్యేక పూజలు చేసి మహామంగళారతి సమర్పించారు. అనం తరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కాగా హళావిన సర్కిల్‌లో రసమంజరి కార్యక్రమంలో కన్నడ, తెలుగు, హిందీ పాటలు ఆలపించగా భక్తులను ఆకట్టుకుంది.

పెట్రో ధరల పెంపుపై బీజేపీ ఖండన

చేళూరు, జూన్ 25: లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడాన్ని తాలూకా బీజేపీ నాయకులు ఖండించారు. పట్టణంలో మంగళవారం బీజేపీ నాయకులు వెంకటరమణరెడ్డి మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ ధరల పెంపు సగటు మధ్యతరగతి ప్రజలపై మరింత భారంగా మారిందన్నారు. ఈ సందర్భంగా గొల్లపల్లి వెంకటరమణ, మహేశ్, పులగల్లు శంకర తదితరులు పాల్గొన్నారు.

13న లోక్ అదాలత్


మీడియాతో ప్రధాన సివిల్ న్యాయాధికారి పూజా తదితరులు

▸▸ న్యాయాధికారి పూజా వెల్లడి

శిడ్లఘట్ట, జూన్ 25: జాతీయ న్యాయ సేవా ప్రాధికార ఆదేశాల మేరకు జూలై 13న లోక్ అదాలత్ జరగనుందని ప్రధాన సివిల్ న్యాయాధికారి జె పూజా వెల్లడించారు. పట్టణంలోని దిబ్బూరహళ్ళి రోడ్డులోగల కోర్టు ఆవరణలో మీడియాతో మాట్లాడారు. రాజీకి యోగ్యమైన కేసులు, పెండింగ్‌లో ఉన్న పాత కేసులను కక్షిదారులతో చర్చించి పరిష్కరించేలా లోక్‌అదాలత్ వేదిక కానుందన్నారు. కక్షి దారులు, ప్రజలు తమ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చు అన్నారు. ఈ సందర్భంగా న్యాయ వాదుల సంఘం అధ్యక్షుడు ఎ.నారాయణస్వామి, ప్రధా న కార్యదర్శి సి.జి.భాస్కర్ పాల్గొన్నారు.

ఆదిజాంబ కార్పొరేషన్ చైర్మన్‌గా మంజునాథ్

బెంగళూరు, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు ముందు హిరియూరులో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నా చేతికి చిక్కితే పాదరక్షలతో కొడతానంటూ చేసిన వ్యాఖ్యలు అప్పట్లో హల్‌చల్ చేశాయి. అదే వ్యక్తి జేఎస్ మంజు నాథ్‌కు కర్ణాటక ఆదిజాంబవ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా అవకాశం కల్పించారు. కంపెనీ యాక్ట్ 2013 ఆర్టికల్ ఆఫ్ అసోసియేషన్ ప్రకారం వెంటనే అమలు లోకి వచ్చేలా సోమవారం ఆదేశించారు. 2008లో హిరి యూరు శాసనసభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన మంజునాథ్ ఓడిపోయారు. ఆ తర్వాత రాష్ట్ర పౌరకార్మికుల సంఘం అధ్యక్షులుగా వ్యవ హరించారు. ఇటీవల కేపీసీసీ అసంఘటిత కార్మిక విభాగం అధ్యక్షుడిగా ఉన్నారు.